విద్యార్థులు కష్టపడి చదువాలి : కలెక్టర్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

చివ్వెంల, జనవరి 23: మండలంలోని బి.చందుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం సందర్శించారు. స్టాఫ్ రూమ్‌తో పాటు తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి భవిష్యత్‌కు పదో తరగతి ఫలితాలే పునాది అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు జరగకపోవడంపై హెచ్ఎం శ్రీనివాస్, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యం, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగం

- బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆరోపణ

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బహిష్కరించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

తిరుమలగిరి, జనవరి 23: తిరుమలగిరి మున్సిపాలిటీలో సుమారు రూ.7 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, కౌన్సిలర్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం తిరుమలగిరి మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. నిధుల దుర్వినియోగంపై గతంలోనే కలెక్టర్‌కు, ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లినా విచారణ చేపట్టలేదని అన్నారు. అప్పటి బిల్లులు, ఇప్పటి బిల్లులు కలిపి లెక్కలు చూపిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ వాహనాలు రిపేర్‌లో ఉండగా మూడు కొత్తవి కొన్నారని, ప్రతి రెండు నెలలకు ఒకసారి సుమారు రూ.లక్ష వరకు పాత వాహనాల మరమ్మతులకు వెచ్చించినట్లు చెబుతున్నారని, వాహనాలు మాత్రం అక్కడే మొరాయిస్తున్నాయని , బిల్లులు మాత్రం నమోదు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా ప్రతి వార్డులో జేసీబీలతో పనులు నడిచినట్లు, మొక్కలు నాటినట్లు బిల్లులు చూపిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని మండిపడ్డారు. నిరసన తెలిపిన వారిలో కౌన్సిలర్ సంకెపల్లి జ్యోతి, కోఆప్షన్ సభ్యులు పాషా, ఫర్హేదా, గోవిందమ్మ ఉన్నారు.

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ప్రారంభం

పూజలు నిర్వహిస్తున్న ముజావర్లు

పాలకవీడు , జనవరి 23: మండలంలోని జాన్‌పహాడ్ దర్గా వద్ద సైదులు బాబా ఉర్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఉర్సులో భాగంగా తొలి రోజు వేకువజామునే దర్గా పూజారి సయ్యద్ జానీ నివాసం నుంచి మేళతాళాలతో గంధ కలశాలను, దట్టీలను ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. దర్గాలోని హజ్రత్ సయ్యద్, మొహినుద్దీన్ షా జాన్‌పాక్ షహీద్ రహమతుల్లా అలై సమాధులతో పాటు వెలుపల ఉన్న సైనిక బృందాల (సిపాయిలు) సమాధులపై గంధం చల్లి పూలమాలలు, దట్టీలతో అలంకరించారు. మగ్రీబ్ నమాజ్, ఈషాద్ నమాజ్‌ను దర్గా ముజావర్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉర్సు సందర్భంగా ఫకీరులు నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం అలరించింది. కాగా, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 540 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఉర్సులో ప్రధాన ఘట్టమైన గంధం ఊరేగింపునకు నేడు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు.

గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

సూర్యాపేట టౌన్, జనవరి 23: నిరుద్యోగుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో హరేకృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో రూ. 5కే మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు తెలిపారు. గురువారం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగుల సమయం వృథా కాకుండా మధ్యాహ్న భోజనాన్ని గ్రంథాలయంలో తక్కువ ధరలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ, లైబ్రేరియన్లు శ్యాంసుందర్ రెడ్డి, కె.విజయభాస్కర్, సృజన పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నివాళి

ఫత్తేసాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ రూరల్, జనవరి 23: మండలంలోని కూచిపూడి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్‌కే.నబీ తండ్రి ఫత్తేసాహెబ్ ఇటీవల మరణించారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ గురువారం వారి నివాసానికి వెళ్లి ఫత్తేసాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేశ్‌నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సంపెట ఉపేందర్‌గౌడ్, మెట్టు శంకర్‌రావు, సుంకర అభిదర్‌నాయుడు, శెట్టి వెంకటనారాయణ, పసుపులేటి పుల్లయ్య, వెంకట్, గోపికృష్ణ, మట్టయ్య, ప్రవీణ్, పెంటు, తరుణ్, బాషా, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 22 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.

NLG-340012

PLOT FOR SALE

★ యాదాద్రి టెంపుల్‌కి సమీపంలో మోత్కూర్ రోడ్, చీమల కొండూరులో రూ. 3,999/-లకే గజం భూమి అమ్మబడును. ఈ ఆఫర్ కొద్దిరోజులు మాత్రమే. Ph: 7989747927.

NT-327005

WANTED

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.

NT-327009-All

CHANGE OF NAME

I, **SHEIK HAZEERA,** W/o. Shaik Jani, H.No.2-26, Seetharama puram (V), Chilkur (M), Suryapet (Dist.), Have changed my name from HAZEERA to SHEIK HAZEERA for all future purposes.

CHANGE OF NAME

I, **SHAIK JOHNBHE,** W/o. Shaik Babu, H.No.2-26, Seetharama puram (V), Chilkur (M), Suryapet (Dist.), Have changed my name from SHAIK JANIBEE TO SHAIK JOHN BHE for all future purposes

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గరంగరంగా గ్రామసభలు

- జాబితాల్లో అనర్హుల పేర్లు ఉన్నాయని అధికారులతో ప్రజల వాగ్వాదం
- అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం

హుజూర్‌నగర్ రూరల్: గోపాలపురంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు

మఠంపల్లి: రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులను గుర్తించేందుకు గురువారం మూడో రోజు నిర్వహించిన గ్రామసభలు గరంగరంగా సాగాయి. అధికారులు వెల్లడించిన జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండడంతో ప్రజలు ఎక్కడికక్కడ నిలదీశారు. అర్హులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. మండలంలోని రఘునాథపాలెంలో అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని, అర్హుల పేర్లు లేకపోవడంతో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్వే సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. మండలంలోని యాతవాకిళ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 5, 6, 12,13 వార్డుల్లో, మండలంలోని చిల్లేపల్లి, మేడారం, కందులవారిగూడెం, పులగంబండ తండా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కమిషనర్ అశోక్‌రెడ్డి, తాసీల్దార్ సైదులు, ఎంపీడీఓ సోమసుందర్ రెడ్డి, ఎంపీఓ హరిసింగ్, ఏఓ జావిద్, ఏపీఓ నాగేందర్, ఏపీఎం శేఖర్, ఎస్ఐ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలంలో పొనుగోడు, రంగాపురం, రేగులగడ్డతండా, అప్పన్నపేట, పరెడ్డిగూడెం, లాచ్యతండా, కొత్తగూడెం, కల్మల్‌చెరువు గ్రామాల్లో గ్రామసభలు జరగగా, ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి శ్యామ్ సుందర్‌ప్రసాద్, తాసీల్దార్ బండ కవిత, ఎంపీడీఓ ఆర్.సరోజ, ఎంఈఓ చక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు. గారకుంటతండాలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా జరిగింది. తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుగులోతు హేమ్లానాయక్, పార్టీ నాయకులు కలిసి ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. లిస్టులలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పేర్లు మాత్రమే ఉన్నాయని, పేద గిరిజనుల పేర్లు లేవని అధికారులపై మండిపడ్డారు.

కోదాడ రూరల్: మండలంలోని తొగర్రాయి, కూచిపూడి, కూచిపూడితండా, చిమిర్యాలలో పోలీస్ పహారాలో గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితా ఏ విధంగా తయారు చేశారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూచిపూడిలో దివ్యాంగురాలు శంకర్‌శెట్టి నాగలక్ష్మి ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నా జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. సెంటు భూమి లేదు, ఇల్లు లేదు, భర్త దినసరి కూలీ అయినా తన పేరు లేదని వాపోయింది.

అనంతగిరి: మండలంలోని శాంతినగర్, బొజ్జగూడెంతండా, పాలవరం, పాలవరంతండాలో గ్రామసభలు నిర్వహించారు. శాంతినగర్ గ్రామంలో అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో అధికారులను గ్రామస్తులు ప్రశ్నించారు. జాబితా తప్పులు తడకగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సూర్యాపేట టౌన్: గతంలో ప్రజాపాలనలో తాము దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేర్లు రాలేదని, ఇప్పుడు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారని, దరఖాస్తు చేసుకుందామంటే ఫారాలు లేవని జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో అధికారులను ప్రజలు నిలదీశారు. పట్టణంలోని 25, 26, 28, 29, 30, 31, 32, 33, 34, 35, 38, 47వ వార్డుల్లో సభలను ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల్లో ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు ఫారాలు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్నా రిసిప్ట్ ఇవ్వకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 32వ వార్డు సభలో అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

నూతనకల్: మండల కేంద్రం నూతనకల్‌తో పాటు లింగంపల్లి, తాళ్లసింగారం, సోమ్లాతండాలో గ్రామసభలు నిర్వహించారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలంలోని కోడూరు, కొమ్మాల, వేల్పుచర్ల, కాసర్లపహాడ్‌లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి అధికారులకు నిలదీతలు ఎదురయ్యాయి. కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన మహిళా రైతు రావుల సోమమ్మ పేరు మీద 2 ఎకరాల 16 గుంటల పట్టా పాసు పుస్తకం ఉండి ఎన్నో ఏండ్లుగా ఆ భూమిలో వ్యవసాయం చేస్తోంది. అయితే 286 సర్వే నంబర్‌లోని 33 గుంటల భూమి సేద్యంలో లేదని, ఇండ్లు నిర్మించారంటూ రైతు భరోసా పథకానికి అర్హులుగా తీసేయడంతో ఆవేదన చెందిన మహిళా రైతు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వేల్పుచర్లలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు భూములు, ఇండ్లు ఉన్నవారినే ఎంపిక చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సభల్లో ఆర్డీఓ వేణుమాధవరావు, జిల్లా పంచాయతీ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామంలో అధికారులపై ప్రజలు మండిపడ్డారు. గ్రామసభలు స్థానిక ఎన్నికల ముందు ఆడుతున్న కొత్త నాటకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ లావణ్య ఎంత సముదాయించినా వినకపోవడంతో గ్రామసభను అర్ధాంతరంగా ముగించారు.

సూర్యాపేట రూరల్: హనుమనాయక్ తండా, కేటీ అన్నారం, ఎర్కారం, కాసరబాద, రాజానాయక్‌తండా, ఎండ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో హనుమనాయక్‌తండా ప్రజలు అధికారులను నిలదీశారు.

ఆత్మకూర్.ఎస్: మండలంలోని నశింపేట, కందగట్ల, బొప్పారం, కాసిగూడెం, కోటపహాడ్, మంగలితండా, ఇస్తాళపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హులకు అవకాశం కల్పించి అర్హుల పేర్లు చేర్చలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాగారం: మండలంలోని ఈటూరు, నాగారంబంగ్లా, లక్ష్మాపురం, పసనూరు గ్రామాల్లో సభలు నిర్వహించారు. జాబితాలో అర్హులైన తమ పేర్లు లేవని నాగారం బంగ్లా గ్రామంలో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూమిని రైతు భరోసాకు అనర్హత జాబితాలో చేర్చారని ప్రశ్నించారు.

మద్దిరాల: మండల కేంద్రం మద్దిరాలలో నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా మారింది. జాబితాలో అర్హుల పేర్లు లేకపోవడంతో గందరగోళం ఏర్పడింది. భూములు, అన్ని రకాలుగా ఆర్థికంగా ఉన్న వారికి పేర్లు ఇందిరమ్మ ఇండ్లలో వచ్చాయని పలువురు ప్రశ్నించారు. రాంపాక వెంకన్న అనే వ్యక్తి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు రాలేదని తాసీల్దార్‌ను నిలదీశారు. దీంతో అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య పక్కకు నెట్టుకుంటూ తీసుకెళ్లాడు.

పెన్‌పహాడ్: మండలంలోని పెన్‌పహాడ్, అనంతారం, పొట్లపహాడ్, దోసపహాడ్, దూపాడ్, లింగాల, చిన్నగారకుంటతండాలో గ్రామసభలు నిర్వహించారు. అనంతారం గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పనికి పోని ధనిక కుటుంబాలను అర్హులుగా గుర్తించడంతో అధికారులను నిలదీశారు. దోసపహాడ్ గ్రామంలో గుంట భూమి లేని నిరుపేదల పేర్లు జాబితాలో రాకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. లింగాల గ్రామంలో కుటుంబాలు 480 ఉండగా, లిస్ట్‌లో 583 మంది పేర్లు ఉండడంతో ఇదేంటని అధికారులను నిలదీశారు. ఇప్పటికే ఇల్లు ఉన్నవారికే మళ్లీ ఇందిరమ్మ ఇళ్లా అని ప్రశ్నించారు. దీంతో పోలీసులు వచ్చి వారిని బయటకు నెట్టివేశారు.

తుంగతుర్తి: మండలంలోని బండరామారం, గానుగుబండ, కర్విరాల, కాశితండా, కేశవాపురం, మానాపురం, రామన్నగూడెం, తూర్పుగూడెం, ఏనెకుంటతండాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అధికారులను నిలదీశారు.

చందుపట్ల గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్

చివ్వెంల: మండలంలోని బి.చందుపట్ల గ్రామసభకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరై మాట్లాడారు. గ్రామసభల్లో సంక్షేమ పథకాల అర్హుల పేర్లు వెల్లడిస్తున్నారని, ఆ వివరాలు ఫైనల్ కావని తెలిపారు. ప్రజాపాలనలో, మీ సేవ ద్వారా, ప్రస్తుతం గ్రామసభల్లో చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఫైనల్ జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. జాబితాలో పేర్లు రాలేదని ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

అధికారులకు సహకరించాలి: ఎస్పీ

చివ్వెంల: అధికారులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ కోరారు. మండలంలోని మూన్యానాయక్‌తండాలో జరిగిన గ్రామసభను ఆయన సందర్శించి మాట్లాడారు. డీఎస్పీ రవి, రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వులో పాల్గొన్న అదనపు కలెక్టర్..

మేళ్లచెర్వు: మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా మండలంలోని రామాపురం, కప్పలకుంటతండా, యతిరాజపురంతండా, వెంకట్రాంపురం, ఎర్రగట్టు తండాల్లో గ్రామసభలు నిర్వహించారు.

కోదాడ రూరల్: కూచిపూడిలో ..

అనంతగిరి: శాంతినగర్‌లో..

పెన్‌పహాడ్: అనంతారం గ్రామంలో..

నాగారం బంగ్లాలో అధికారులను ప్రశ్నిస్తున్న వ్యక్తి

గరిడేపల్లి: అధికారులను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు హేమ్లానాయక్

అర్వపల్లి: కాసర్లపహాడ్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

పెద్దగట్టులో వ్యాపారాల నిర్వహణకు వేలం

చివ్వెంల, జనవరి 23: వచ్చే నెల 16వ తేదీ నుంచి 20 వరకు జరగనున్న పెద్దగట్టు జాతరలో వ్యాపారాల నిర్వహణకు గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేలం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నర్సయ్య యాదవ్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి వేలాన్ని ప్రారంభించారు. కొబ్బరికాయల విక్రయ హక్కును సూర్యాపేటకు చెందిన మద్దెబోయిన శ్రీనివాస్ రూ.26.66 లక్షలకు సొంతం చేసుకున్నారు. లడ్డూ, పులిహోర హక్కులను ధరావత్ మణికుమార్ రూ.12.50 లక్షలకు దక్కించుకున్నారు. తలనీలాలు సేకరణను సూర్యాపేటకు చెందిన తన్నీరు లింగయ్య రూ.10.25 లక్షలకు సొంతం చేసుకున్నారు. కొబ్బరి చిప్పల సేకరణను అలిశెట్టి రాజు రూ.3. 25 లక్షలకు దక్కించుకున్నారు. నాయిబ్రాహ్మణ హక్కు వేలం వాయిదా పడినట్లు ఈఓ కుశలయ్య తెలిపారు.

అధికారులతో వాగ్వాదం..

వేలం సందర్భంగా అధికారులతో టెండర్ దారులు వాగ్వాదానికి దిగారు. మొదటగా కొబ్బరికాయల వేలంలో టెండర్ వేయని వ్యక్తులు సైతం పాల్గొని పాట పాడటంతో కొంత అంతరాయం ఏర్పడింది. తలనీలాల సేకరణకు షీల్డ్ కవర్లు సమర్పించిన అనంతరం విజయవాడకు చెందిన వేణుగోపాల్ అనే వ్యక్తి టెండర్‌లో పాల్గొనడంతో సుమారు గంట పాటు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జాటోతు లక్ష్మి కటిలాల్, షేక్ బాషా, ఈఓ కుశలయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్లై ఓవర్ నిర్మాణాన్ని విరమించుకోవాలి'

అర్వపల్లి, జనవరి 23: మండల కేంద్రంలో ప్లై ఓవర్ నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ గ్రామస్తులు గురువారం హైదరాబాద్‌లో రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని ప్లై ఓవర్‌ను నిర్మించొద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అర్వపల్లిలో జరిగిన 365,365బీ జాతీయ రహదారుల విస్తరణలో వందలాది ఇండ్లు, దుకాణాలు కోల్పోయామని, మళ్లీ ప్లై ఓవర్‌తో 200 ఇండ్లు కోల్పోయే అవకాశం ఉందని, తమ కుటుంబాలు వీధిన పడకుండా చూడాలని కోరారు.

కోమటిపల్లిలో వైద్య శిబిరం

అర్వపల్లి, జనవరి 23: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో గురువారం క్షయ వ్యాధి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎవరికైనా క్షయ లక్షణాలు ఉన్నట్లయితే సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా నయమవుతుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు భూక్యా నగేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత,టీబీ నోడల్ పర్సన్ వీరయ్య, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వస్రీత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఊర్మిళ పాల్గొన్నారు.

'గీత కార్మికుల సంక్షేమానికి కృషి'

మాట్లాడుతున్న ప్రసాద్

మునగాల, జనవరి 23: అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్స్‌లు ఇప్పిస్తామని కౌండిన్య గౌడ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మికులకు నిర్వహించిన టాపింగ్ టెస్టుకు ఆయన హాజరై మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిలుకూరు, జనవరి 23: మండల కేంద్రం సమీపంలోని బేతవోలు క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన షేక్ కాసీంసాహెబ్ కోదాడ నుంచి జెర్రిపోతులగూడెం వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, హుజుర్‌నగర్ నుంచి కోదాడ వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నగదు చోరీ

హుజూర్‌నగర్, జనవరి 23: హుజూర్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌లోని రూ.1.40 లక్షలను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమరవరం గ్రామానికి చెందిన కనుకుంట్ల రామయ్య గతంలో బ్యాంక్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడు. గురువారం రెన్యువల్ చేసుకోవడం కోసం మిర్యాలగూడ రోడ్డులోని యూనియన్ బ్యాంక్‌కు వెళ్లాడు. రెన్యువల్‌కు ఇంకా గడువు ఉందని మేనేజర్ చెప్పడంతో తిరిగి అమరవరం వెళ్తూ లింగగిరి రోడ్డులో ఉన్న పోంచర్ల వైన్స్ దగ్గర ఆగాడు. తిరిగి వచ్చి చూసేసరికి టీవీఎస్ మోటార్ సైకిల్ ట్యాంక్ కవర్‌లోని రూ.1.40 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

నిందితుడి అరెస్ట్

కోదాడ రూరల్, జనవరి 23: కోదాడలో పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ టి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నాను నావెల్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, గతంలో కోదాడ పట్టణంతో పాటు ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి 12 తులాల బంగారు నగలు, కిలో వెండి, రూ.17,780 నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కోదాడ, జనవరి 23: రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం కోదాడ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేయకపోతే తలవంచుకుంటామే తప్ప మాయమాటలు చెప్పబోమన్నారు. అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కాగా, తొలుత వ్యవసాయ మార్కెట్ కమిటీ